నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, గురువారం 22 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM


# బంజారాల ఆరాధ్యుడు సేవాలాల్

**భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం, ఫిబ్రవరి 21 : సంత్ సేవాలాల్ మహరాజ్ గిరిజనుల ఆరాధ్య దైవమని, ఆయనను లంబాడీలు దేవుడిగా భావించి కొలుస్తారని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి సందర్భంగా ఆలిండియా బంజార సేవా సంఘం, భద్రాచలం ఆధ్వర్యంలో భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. పీవో, ఆర్డీవో, బంజారా కమిటీ సభ్యులతో కలిసి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అతిథులకు కమిటీ సభ్యులు బంజారా సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. భోగ్ భండారో, వింతీ కార్యక్రమంతోపాటు బంజారా సోదరుల సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ ప్రకృతిని, వన్య ప్రాణులను పరిరక్షించడం ద్వారా మానవ జన్మకు సార్థకత చేకూర్చుకోవాలని సూచించే వారన్నారు. తెలంగాణ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్ణయించినందున ఈ నెల 15 నుంచి 21 వరకు ఉమ్మడి జిల్లాలోని గ్రామాల్లో బంజారా సోదరులు ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ మాట్లాడుతూ లంబాడీ, బంజారా తెగల కోసం సేవాలాల్ మహరాజ్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ ఎల్.వెంకటేశ్వర్లు, వీ.కృష్ణనాయక్, బీ.బన్సీలాల్, నాగులు, సైదులు, గోవిందు, హరిశ్చంద్రనాయక్, బిచ్చునాయక్, బీ.నాగేశ్వరరావు, భూక్యా శ్వేత, వీరన్న, తారాచంద్ పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజుకు మాజీ మంత్రి పువ్వాడ శుభాకాంక్షలు



ఎంపీ వద్దిరాజుతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఫిబ్రవరి 21 : బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం మేరకు రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి.. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు చెప్పారు. వద్దిరాజు రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

- **వేసవిలో అగ్గిపడితే బుగ్గిపాలయ్యేలా రైతుల పంటలు**
- **ఖమ్మం ఏఎంసీలో కరువైన అగ్నిమాపక సేవలు**
- **నిత్యం 50 వేలకు పైగానే వస్తున్న మిర్చి బస్తాలు**
- **రూ.కోటి నిధులు వెచ్చించినా కనిపించని ఫలితం**
- **ఐదేళ్లలో ఐదుసార్లు ప్రారంభం.. కర్షకుల కలవరం**



# అలంకారప్రాయం..

మార్కెట్ నిధులతో నిర్మించిన అగ్నిమాపక కేంద్రం

# అగ్నిమాపక కేంద్రం

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 21 : సకల సౌకర్యాలకు నెలవైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు కొన్నేళ్లుగా అగ్నిమాపక సేవలు అందుబాటులో లేవు. ఏడాదంతా అన్నదాతలు రెక్కలు ముక్కలు చేసుకొని పండించి తెచ్చిన పంటలు ప్రమాదపుటంచున ఉంటున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగానో, ఏమరుపాటుగానో ఎటునుంచైనా పొరపాటున అగ్గిపడితే ఆ పంటలన్నీ బుగ్గిపాలయ్యే పరిస్థితి నెలకొంది. ఈ ప్రధాన సమస్య కర్షకులను కలవరపెడుతోంది. సీజన్ వచ్చిన ప్రతిసారీ అటు అధికారులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది.

### అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా ఉన్నా..

రాష్ట్రంలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం ఏఎంసీ ఒకటి. ప్రస్తుతం ఇక్కడ పూర్తి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. పంట ఉత్పత్తులకు అనుగుణంగా మిర్చి, అపరాలు, పత్తి పంటల కోసం వేర్వేరు యార్డులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఖమ్మంతోపాటు పొరుగున ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని కృష్ణా జిల్లాల రైతులు ఏడాది పొడవునా ఇక్కడికి తమ పంటలను తెచ్చి విక్రయిస్తుంటారు. ఇంతటి ఘనత ఉన్నప్పటికీ ఖమ్మం ఏఎంసీలో అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేదు. మిర్చి సీజన్‌లో అన్నదాతలను ఈ సమస్య తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.



మిర్చి బస్తాలతో కిటకిటలాడుతున్న ఖమ్మం మార్కెట్‌యార్డు

### రూ.కోటి వెచ్చించినా ఫలితం శూన్యం

మార్కెట్‌కు వచ్చే పంటకు భద్రత కల్పించాలనే ఉద్దేశంతో 2010లో అప్పటి పాలకవర్గం మార్కెట్లో అగ్నిమాపక సేవలు అందుబాటులోకి తీసుకురావాలని తీర్మానించింది. మార్కెట్ కమిటీ స్థలంలోనే రూ.50 లక్షల వ్యయంతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం సుమారు రూ.55 లక్షలతో నూతన అగ్నిమాపక వాహనాన్ని కొనుగోలు చేశారు. 2015లో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ నూతన అగ్నిమాపక కేంద్రాన్ని, వాహనాన్ని ప్రారంభించారు. దీంతో రైతులు ఊరట పొందారు. కానీ.. తాము చెల్లించిన రూ.55 లక్షల మొత్తానికి కొత్త వాహనాన్ని కాకుండా వినియోగించిన వాహనాన్ని అగ్నిమాపక శాఖ ఇచ్చిందంటూ ఏఎంసీ బాధ్యులు దాన్ని తిరస్కరించినట్లు తెలిసింది. అలాగే.. వాహన సిబ్బంది కూడా అగ్నిమాపక శాఖ విశ్రాంత ఉద్యోగులు కావడం, వారికి ఏఎంసీ బాధ్యులు అంతటి అధిక వేతనాలు ఇవ్వలేకపోవడం వంటి కారణాలతో వారు కూడా విధులకు రాకపోవడం వంటివి జరిగినట్లు సమాచారం. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.

### ఐదేళ్లలో ఐదుసార్లు ప్రారంభం

కాగా.. ఇక్కడి అధికారులు, పాలకవర్గ బాధ్యులు ఖమ్మం ఏఎంసీలో ఈ ఐదేళ్లలో సుమారు ఐదుసార్లు అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించారు. రైతు సంఘాల బాధ్యులు, వ్యాపారుల ఒత్తిడి మేరకు పాలకవర్గ బాధ్యులు ప్రతిసారీ ఏదో ఒక అగ్నిమాపక వాహనాన్ని తేవడం, ఆ తరువాత అది వెళ్లిపోవడం వంటివి సర్వసాధారణమయ్యాయి. అయితే ఏటా డిసెంబర్ నుంచి సీజన్ ప్రారంభం కావడంతో పత్తి, మిర్చి పంటలు మార్కెట్‌కు పోటెత్తుతాయి. దీనికితోడు మార్కెట్‌కు సమీపంలోనే దాదాపు పది కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. పొరపాటున ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం పత్తి మార్కెట్‌లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేలోపు పంటంతా బూడిదైన విషయం విదితమే. ప్రాథమిక నివారణ కోసం పత్తి యార్డులో చిన్నపాటి అగ్నిమాపక యంత్రాలు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి తుక్కుపట్టిపోయాయి.

### అగ్నిమాపక శాఖతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం..



ఖమ్మం ఏఎంసీకి రైతులు తీసుకొచ్చే పంటలకు పూర్తి భద్రత కల్పిస్తాం. సాధారణంగా సీజన్‌లో అగ్నిమాపక శాఖ నుంచి అదనపు వాహనాన్ని తెప్పించి సిద్ధంగా ఉంచుతాం. సీజన్ అనంతరం తిరిగి అప్పగిస్తాం. అయితే ఖమ్మం ఏఎంసీలో కొనుగోలు చేసిన వాహనం తదితర విషయాలను అధికారుల ద్వారా తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. వాహన సమస్య గురించి అగ్నిమాపక శాఖతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.

– ప్రవీణ్‌కుమార్, ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ

# ఖిల్లా అభివృద్ధికి డీపీఆర్ రూపొందించండి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ఆదేశం**



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఫిబ్రవరి 21 : ఏళ్ల చరిత్ర కలిగిన ఖమ్మం ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ రూపొందించి నివేదిక సమర్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆర్కియాలజీ, పర్యాటక శాఖ అధికారులతో ఖమ్మం పోర్టు అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరవాసులను, పర్యాటకులను ఆకర్షించే విధంగా నిపుణులైన కన్సల్టెంట్లను సంప్రదించి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఖిల్లాలో రోప్ వే, తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, ఫుడ్ కోర్టు, మెట్ల రెయిలింగ్, లైటింగ్, గజిబోస్, సీటింగ్ బెంచీలు, విద్యుత్ సరఫరా, కోట ప్రాంత పరిరక్షణతోపాటు పర్యాటక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఆర్కియాలజీ అండ్ మ్యూజియం శాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ, రాష్ట్ర పర్యాటక శాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజినీర్లు రామకృష్ణ, శ్రీధర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిధిలోని 485 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయండి

**సంస్థ సీఎండీ బలరాంకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం**



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 21: సింగరేణి పరిధిలో ఖాళీగా ఉన్న 317 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులతో పాటు 168 ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ పోస్టుల భర్తీకి తక్షణం నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్‌తో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ పరిధిలో నిలిచిన కారుణ్య నియామక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఏడాదిలో కనీసం వెయ్యి మంది వారసులకైనా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వారసుల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచే విషయంపై సంస్థ సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి ప్రీమియం చెల్లింపు లేకుండానే కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా కల్పించే దిశగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎండీ సమాధానమిచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం కొత్తగూడెంలో నిర్మించిన 10.5 మెగావాట్ల సింగరేణి సోలార్ ప్లాంట్‌ను ఈ నెల 26న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ‘ఆయిల్‌పాం’కు పర్యవేక్షణ ఆఫీసర్ల నియామకం

**ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి**



క్షేత్ర పర్యవేక్షణ ఆఫీసర్లకు సూచనలిస్తున్న ఎండీ సురేందర్‌రెడ్డి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 21 : సాగులో రైతులకు సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు ఆయిల్ ఫెడ్ పరిధిలోని 8 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ఇద్దరు చొప్పున క్షేత్ర పర్యవేక్షణ ఆఫీసర్లను నియమించినట్లు ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఆయిల్‌పాం సాగుపై శిక్షణ పొందుతున్న ఆఫీసర్లను బుధవారం ఆయన కలిసి పలు సూచనలు చేశారు. అశ్వారావుపేట మండలం భీమునిగూడెంకు చెందిన కాసాని వెంకటేశ్వరరావు, దమ్మపేట మండలం దమ్మపేట, పట్వారీగూడేనికి చెందిన ఇనుగంటి మోహన్‌రావు, కోటగిరి వెంకటేశ్వరరావు పామాయిల్ తోటలను పర్యవేక్షకులతో కలిసి సందర్శించారు. మందలపల్లిలో కొత్తగా పామాయిల్ తోట వేస్తున్న రైతుతో కలిసి మొక్క నాటారు. అనంతరం ఎండీ మాట్లాడుతూ క్షేత్ర పర్యవేక్షణ ఆఫీసర్లు పామాయిల్ రైతులకు అందుబాటులో ఉండి.. సాగులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. అలాగే ప్లాంటేషన్ ప్రక్రియ, డ్రిప్, సాగునీరు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, మల్చింగ్, పంటల దిగుబడిలో తగు సూచనలు చేస్తారని తెలిపారు. ఆయన వెంట డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# జోర్‌దార్‌గా మిర్చి విక్రయాలు

- **లక్ష బస్తాలతో ఎరుపెక్కిన ఖమ్మం ఏఎంసీ**
- **నేడు, రేపు మార్కెట్‌కు వరుసగా సెలవులు**
- **తిరిగి శనివారం యథావిధిగా మార్కెట్**



మార్కెట్ యార్డులు నిండిపోవడంతో వీధిలోనే బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 21: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో జోర్‌దార్‌గా మిర్చి అమ్మకాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం రైతులు మార్కెట్‌కు లక్ష మిర్చి బస్తాలకు పైగా తీసుకురాగా మార్కెటింగ్‌శాఖ అధికారులు మిర్చి యార్డుతోపాటు అపరాల యార్డునూ మిర్చి విక్రయాలకు కేటాయించారు. ఏఎంసీ పరిధిలో బుధవారమూ ఇదే ఒరవడి కనిపించింది. రైతులు ఇంచుమించు లక్ష బస్తాలకు పైగా మిర్చిని మార్కెట్‌కు తీసుకొచ్చారు. దీంతో మిర్చి యార్డుతో పాటు అపరాల యార్డు కూడా మిర్చి బస్తాలతో నిండింది. ఏఎంసీకి ఖమ్మం జిల్లా నుంచే కాక పొరుగు జిల్లాలైన భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల నుంచీ పంట తరలొచ్చింది. గత్యంతరం లేని స్థితిలో కొన్ని బస్తాలను రహదారి పక్కన ఉంచి క్రయ విక్రయాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం జరిగిన జెండా పాటలో క్వింటాకు గరిష్ఠ ధర రూ.21,350 పలుకగా, మధ్యస్థ ధర రూ.19,500, కనిష్ఠ ధర రూ.14 వేల చొప్పున పలికింది. అలాగే తాలు రకం మిర్చికి గరిష్ఠ ధర క్వింటాల్‌కు రూ.12 వేలు పలుకగా, కనిష్ఠ ధర రూ.7 వేలు పలికింది. ఏఎంసీకి భారీగా పంట రావడంతో కాంటాలు, తోలకాల ప్రక్రియలు మందకొడిగా సాగాయి. క్రయవిక్రయాలను మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా మేడారం జాతరను పురస్కరించుకొని గురు, శుక్రవారాల్లో మార్కెట్‌కు సెలవులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం వారాంతపు సెలవు అయినప్పటికీ మిర్చి క్రయవిక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు.. సర్వం సిద్ధం చేయాలి

- **ఈ నెల 28 నుంచి వచ్చే నెల 19 వరకూ పరీక్షలు**
- **36 కేంద్రాలు.. 19,477 మంది విద్యార్థులు..**
- **అధికారుల సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక**



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21: ఈ నెల 28 నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం సర్వం సిద్ధం చేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై విద్య, రెవెన్యూ, పోలీసు, వైద్య, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ అధికారులతో ఐడీవోసీలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఈ నెల 28న ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 19తో ముగుస్తాయని అన్నారు. ఫస్టియర్‌లో 10,200 మంది, సెకండియర్‌లో 9,277 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇందుకోసం 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే వీటన్నింటిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 16 పోలీస్‌స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపర్చాలని సూచించారు. 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది శాఖాపరమైన అధికారులు, 13 మంది అదనపు పర్యవేక్షకులు విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలను, ఐదు కస్టోడియన్స్ బృందాలను నియమిస్తున్నట్లు తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బందికి డ్యూటీ జారీ చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని, పరీక్ష కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై చెక్‌లిస్ట్ తయారు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో అత్యవసర వైద్య కేంద్రాలు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షల గురించి సందేహాల నివృత్తి కోసం విద్యార్థులకు హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. సందేహాలుంటే 9704661714, 9846913069 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, డీఆర్వో రవీంద్రనాథ్, డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డీఈవో వెంకటేశ్వరాచారి, వివిధ శాఖల అధికారులు వెంకటరత్నం, ప్రభాకర్‌రావు, విజయబాబు, శేషాంజన్‌స్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు మహాప్రభో!

- **కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నిలిచిన వేతనాలు**
- **రెండు నెలలుగా ఎదురుచూపులు కుటుంబాల పోషణకు కష్టాలు**
- **ఇచ్చిన హామీ నిలుపుకోవాలంటున్న అంగన్‌వాడీలు**

కరీంనగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్: ‘ఓడెక్కే దాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న’ అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసన సభా ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతో పాటు ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆనెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చినా.. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.

### నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరేళ్లలోపు బాలలకు ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే, ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినపుడల్లా కంటితుడుపుగా రూ.వంద నుంచి రూ.200లో పెంచేవారు. అవి ఏ మూలకూ సరిపోక ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే కీలకమైన సేవల్లో ఉన్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో నిమిత్తం లేకుండా ఈ చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 వేతనం అందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్నట్టుగా రెండుసార్లు పీఆర్సీ అమలు చేసింది. అయితే కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు వేతనాలు కాస్త ఆలసమయ్యాయి కానీ, ఏ నెల కూడా వేతనాలు ఆపలేదు.

### నేడు జీతాల కోసం ఎదురుచూపు

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చింది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏనెలకు ఆ నెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇంకా ఒకటో తారీఖే వేస్తామని చెప్పింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75 రోజులు గడిచింది. కానీ, ఇప్పటికీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 35వేల సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 65 వేల అంగన్‌వాడీలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏరు దాటినంక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మారుతున్నదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ నాయకుల ఎదుట అయినా గోడు వెళ్లబోసుకుందామంటే, కనీసం వారిని కలిసే సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు సత్వరమే జీతాలు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

# అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం

**ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు ముమ్మరం చేస్తాం**

**జిల్లా రవాణా శాఖ అధికారి ఆఫ్రీన్ సిద్దిఖీ**



రఘునాథపాలెం, ఫిబ్రవరి 21 : జిల్లాలో ఇసుక, మైనింగ్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలను విస్తృతం చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి ఆఫ్రిన్ సిద్దిఖీ అన్నారు. రెండు రోజుల క్రితం జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురితమైన ‘జోర్దార్.. సర్దార్’ కథనాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లాలో ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా పోలీసులతో కలిసి జాయింట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదాలను నివారించడానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తమ కార్యాలయానికి పలు సేవల నిమిత్తం వచ్చే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో యువకుల ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెడతామని, మైనర్లు వాహనాలతో రోడ్డెక్కితే సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. రవాణా శాఖ కార్యాలయం పక్కన రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నట్లు గుర్తించామని, లైసెన్స్‌లు లేకుండా షాపులు నిర్వహిస్తున్న వారికి నోటీసుల జారీ కోసం కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతామని ఆమె పేర్కొన్నారు.

# ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలని రైతుల ఆందోళన



గ్రీన్‌ఫీల్డ్ పనుల వద్ద రైతుల ఆందోళన

చింతకాని, ఫిబ్రవరి 21: గ్రీన్ ఫీల్డ్ హైవేతో గ్రామాలకు మంచి జరుగుతుందని రూ.కోట్లు విలువ చేసే భూములు అప్పగించామని, కానీ ఇప్పటివరకు ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని రామకృష్ణాపురం వద్ద ఎగ్జిట్ పాయింట్ ఇవ్వలేదని బుధవారం రామకృష్ణాపురం, ధంసలాపురానికి చెందిన సుమారు 200 మంది రైతులు హైవే పనులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. హైవే అధికారులు, జిల్లా మంత్రులు చొరవ చూపి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆందోళనలో రైతులు సీతారామిరెడ్డి, నరసింహారెడ్డి, పిన్నెల్లి శ్రీను, అప్పిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉపేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.